# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 17-08-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకడ్ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో నిర్వహించిన స్వర్ణ భారత్ ట్రస్ట్ 23వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.**
2. **అభివృద్ధి దిశగా గ్లోబల్ సౌత్ దేశాలు ఏకం కావాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు.**
3. **దేశంలో మూడు కొత్త మెట్రో రైలు ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.**
4. **ఏపీఎస్ఆర్టీసీ సంస్థను బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.**
5. **రాష్ట్రంలో ఇంజినీరింగ్ మూడో విడత కౌన్సెలింగ్ ఈ నెల 19 నుంచి ప్రారంభించనున్నట్లు కన్వీనర్ గణేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.**

==========================

భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకడ్ రాష్ట్రంలోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ రోజు ఉదయం తిరుపతి నుంచి నెల్లూరులోని పోలీస్ పెరేడ్ మైదానానికి చేరుకున్న ఉపరాష్ట్రపతికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు. అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వెంకటాచలం మండలం సరస్వతి నగర్‌లోని అక్షర విద్యాలయానికి చేరుకుని విద్యాలయంలో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ఉప రాష్ట్రపతి పరిశీలించారు. తర్వాత స్వర్ణ భారత్ ట్రస్ట్ కు చేరుకున్న ఉపరాష్ట్రపతికి పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్వాగతం పలికారు.అనంతరం ట్రస్ట్ 23వ వార్షికోత్సవ వేడుకల్లో ఉపరాష్ట్రపతి పాల్గొని ప్రసంగిస్తూ..

వాయిస్ (25 సెకన్లు)

--------------------------

అభివృద్ధి దిశగా గ్లోబల్ సౌత్ దేశాలు ఏకం కావాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. ఈ రోజు దృశ్య మాధ్యమం విధానం ద్వారా నిర్వహించిన 3వ వాయిస్ ఆఫ్ గ్లోబల్ సౌత్ సదస్సులో స్థిరమైన భవిష్యత్తు కోసం గ్లోబల్ సౌత్‌ను బలోపేతం చేయడం అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్లోబల్ సౌత్ అభివృద్ధి, సహాయసహకారాలకు భారత్ కట్టుబడి ఉందన్నారు. ప్రపంచాన్ని ప్రభావితం

చేసే సంఘర్షణలు, ఆహారం, ఇంధన భద్రత సంక్షోభాలు, వాతావరణ మార్పుల వంటి సంక్లిష్ట సవాళ్లపై చర్చించేందుకు  ఈ అంతర్జాతీయ సదస్సు ఒక వేదికగా పనిచేస్తుందని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ (34 సెకన్లు)

---------------------------

దేశంలో మూడు కొత్త మెట్రో రైలు ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. నిన్న ప్రధానమంత్రి  నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రి వర్గ  నిర్ణయాలను నిన్న ఆయన పాత్రికేయులకు వివరించారు. మూడవ సారి ఎన్డీయే ప్రభుత్వం  ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు లక్షా  54 వేల కోట్ల రూపాయల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆమోదం తెలిపిందన్నారు. బెంగుళూరు మెట్రో మూడవ దశ, థానే ఇంటిగ్రల్ రింగ్ మెట్రో రైలు ప్రాజెక్ట్, పూణే మెట్రో పేజ్-1 ప్రాజెక్ట్ పొడిగింపు ఉన్నాయని చెప్పారు.  ప్రస్తుతం 21 నగరాల్లో మెట్రో రైలు పనిచేస్తోందని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ( 21 సెకన్లు)

అలాగే బీహార్లోని బిహ్టో, పశ్చిమ బెంగాల్ లోని బాగ్డోగ్రా విమానాశ్రయాలలో కొత్త భవన నిర్మాణాలకు కూడా కేంద్ర మంత్రి వర్గం  కమిటీ ఆమోదం తెలిపిందని వైష్ణవ్ చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి  తెలిపారు. వైయస్సార్ జిల్లా కడప నగరంలో క్యాంపు కార్యాలయాన్ని మంత్రి  నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవసరమైన బస్సులు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ నెల21 న జరిగే  సమీక్ష సమావేశంలో రవాణా శాఖకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో ఇంజినీరింగ్ మూడో విడత కౌన్సెలింగ్ ఈ నెల 19 నుంచి ప్రారంభించనున్నట్లు కన్వీనర్ గణేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి 21 వరకు ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు, 22 వ తేదీన ధ్రువపత్రాల పరిశీలన , 20 నుంచి 22 వరకు కోర్సులు, కళాశాలల ఎంపికకు వెబ్ ఐచ్ఛికాల నమోదు, ఐచ్ఛికాలు మార్చుకునేందుకు 23న అవకాశం కల్పించామని, 26న సీట్లు కేటాయిస్తామని ప్రకటనలో పేర్కొన్నారు.

---------------------------

జాతీయ చలనచిత్ర పురస్కారాలకు ఎంపికైన నటీనటులు, దర్శక నిర్మాతలు, సాంకేతిక నిపుణులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అభినందనలు తెలిపారు. “ఉత్తమ ప్రాంతీయ చిత్రాల విభాగంలో తెలుగు నుంచి కార్తికేయ-2 పురస్కారం హర్షణీయమన్నారు. అలాగే ఉత్తమ నటుడు రిషబ్ శెట్టి, ఉత్తమ నటి నిత్యమీనన్, పొన్నియన్ సెల్వన్, కాంతారా, తిరు చిత్రంబళం, కేజీఎఫ్-2 వంటి చిత్రాలు వివిధ కేటగిరీల్లో పురస్కారాలు పొందినందుకు అభినందనలు అని  ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

---------------------------

తుంగభద్ర జలాశయంలో వరద ఉధృతికి కొట్టుకుపోయిన 19వ క్రస్ట్‌గేటు స్థానంలో బిగించాలనుకున్న స్టాప్‌లాగ్ గేట్లో మొదటి ఎలిమెంటును నిన్న రాత్రి అమరిచినట్లు అధికారులు తెలిపారు. రెండు భారీ క్రేన్ల సాయంతో 20 మంది కార్మికులతో ఈ పనిని చేపట్టామని తెలిపారు. ఫలితంగా జలాశయం నుంచి దిగువకు వెళ్తున్న నీటి వృధా కొంతమేరకు అరికట్టినట్లు ప్రాజెక్టు అధికారులు చెప్పారు. మరో రెండు ఎలిమెంట్లును కూడా త్వరలో అమరుస్తామన్నారు. కాగా తుంగభద్ర జలాశయం నుంచి మొత్తం 33 గేట్లలో 25 గేట్ల గుండా 86 వేల 310 క్యూసెక్కుల నీటిని నదికి విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి 33 వేల 419 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది.

---------------------------

విద్యార్థులు విజ్ఞాన శాస్త్రం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ–ఐఐటి డైరెక్టర్ డాక్టర్ కె.ఎన్.సత్యనారాయణ అన్నారు. తిరుపతి జిల్లా ఏర్పేడులోని భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థలో ఆగస్టు 23వ తేదీన నిర్వహించనున్న జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు కార్యక్రమాలను ఐఐటిలో ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ, శాస్త్ర సాంకేతిక రంగంలో ఎన్నో సేవలను అందించిన అబ్దుల్ కలాం లాంటి వ్యక్తులను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆగస్టు 23వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.

---------------------------

దేశంలోని ప్రధాన నగరాలకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నేరుగా విమానాలను నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వి బాలశౌరి అన్నారు. విజయవాడ విమానాశ్రయం నుంచి ముంబై వెళ్లే ప్రత్యేక ఇండిగో సర్వీసును నిన్న రాత్రి ఎంపీ కేశినేని శివనాథ్, , విమానాశ్రయ డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ.. కోల్‌కతా, వారణాసి, సింగపూర్, థాయిలాండ్, శ్రీలంకకు సర్వీసులు నడపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. త్వరలో అంతర్జాతీయ సర్వీసుల పెంపుతో విమానాశ్రయం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలో అహ్మదాబాద్, పుణేకు సర్వీసులు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈనెల 27వ తేదీన ఉదయం 11 గంటలకు సచివాలయంలో రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులను జారీ చేశారు. 27వ తేదీ నుంచి కాగిత రహితంగా ఈ–కేబినెట్ సమావేశం నిర్వహించాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు ట్యాబ్‌ల ద్వారా మంత్రి వర్గ సమావేశాన్ని నిర్వహించనున్నారు. కాగా ఈ నెల 27వ తేదీన మంత్రి వర్గ సమావేశానికి ప్రతిపాదించాల్సిన అంశాలను ఈనెల 23వ తేదీ సాయంత్రం 4 గంటలకల్లా సాధారణ పరిపాలన శాఖ కు పంపాల్సిందిగా అన్ని శాఖలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.

---------------------------

శ్రీ సత్యసాయి జిల్లాలో  భారీ వర్షం కారణంగా కొత్తచెరువు మండలం కేశాపురం ఆముదాలగుంట రహదారి వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో రాకపోకలను దారి మళ్లిస్తున్నట్లు పుట్టపర్తి రెవెన్యూ డివిజన్ అధికారి– ఆర్డీవో భాగ్య రేఖ ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం నుండి పుట్టపర్తి వచ్చే ఆర్టీసి బస్సులు పెనుగొండ మీదుగా వెళ్లాలని తెలిపారు. ద్విచక్రవాహనదారులు వరద నీటి ప్రవాహంలోకి వెళ్లకూడదని, జాగ్రత్తగాలు తీసుకోవాలని సూచించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలు ఈ సమాచారంను గమనించాలని కోరారు.

======================